క్లుప్తంగా

రేపు 'ఆడుదాం ఆంధ్ర' ముగింపు వేడుకలు

రాయవరం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం జగనన్న ఆడుదాం ఆంధ్ర ముగింపు వేడుకలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఎంపీడీవో కొవ్వూరి నరేంద్రరెడ్డి శనివారం విలేకరులకు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మండల స్థాయి క్రీడా పోటీల ముగింపు వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు.

శాస్త్రీయంగా అభివృద్ధి ప్రణాళికలు



మండపేటలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాజు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలంలోని 12 పంచాయతీల్లో శాస్త్రీయంగా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించే దిశగా అడుగులు వేస్తున్నట్టు ఎంపీడీఓ ఐదం రాజు తెలిపారు. ఆ మేరకు శుక్ర, శనివారాల్లో రెండు రోజులపాటు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చామన్నారు. రెండో రోజు శిక్షణలో ప్రత్యేక శిక్షణ పొందిన గ్రేడ్ -1 పంచాయతీ కార్యదర్శులు వీవీఆర్కే రాజు, కె.సాయిప్రసాద్‌లు ప్రణాళిక రూపకల్పనపై శిక్షణ ఇచ్చారు. ఎంపీడీఓ ఐదం రాజు మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు మార్గదర్శకమవుతాయన్నారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి వీఎన్ ప్రసాద్, వెలుగు శాఖ ప్రతినిధి రవిరాజా, తదితర ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి ఖర్చులకు రూ.10వేల అందజేత



కేశవరంలో నగదును అందజేస్తున్న దృశ్యం

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం కేశవరం గ్రామానికి చెందిన తాపీ మేస్త్రి షేక్ రహీమ్ (35) శుక్రవారం రాత్రి గుండెపోటుతో చనిపోయాడు. వెంటనే స్పందించిన సచివాలయ ఉద్యోగులు వైఎస్సార్ బీమా మంజూరు చేయించారు. రూ.లక్ష మంజూరు కాగా తక్షణ ఖర్చుల నిమిత్తం శనివారం రూ.10 వేల నగదును సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ సామ్యూల్, పీఏసీఎస్ డైరెక్టర్ చంద్రమళ్ళ ఎస్సయ్య, వైఎస్సార్ సీపీ నాయకుడు తుపాకుల ప్రసన్నకుమార్ చేతుల మీదుగా మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు.

306 మందికి వైద్య సేవలు



అర్తమూరులో ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్, వైఎస్ ఎంపీపీ

కపిలేశ్వరపురం (మండపేట): మండలంలోని అర్తమూరులో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరంలో 306 మందికి వైద్యసేవలు అందించారు. అర్తమూరు పంచాయతీ కార్యాలయం సమీపంలో ఏర్పాటుచేసిన శిబిరాన్ని పంచాయతీ సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ ప్రారంభించారు. శిబిరంలో రోగులకు వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కంటి వెలుగు పథకం కింద 64 మందికి వైద్య పరీక్షలు చేశారు. సర్పంచ్ అన్నపూర్ణ, వైస్ ఎంపీపీ గొలుగూరి విజయ భాస్కరరెడ్డి మాట్లాడుతూ ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు ఎం.సుమలత, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు గొలుగూరి సందీప్‌రెడ్డి, ఈఓ అనిల్‌కుమార్ పాల్గొన్నారు

అప్పనపల్లికి భక్తుల తాకిడి



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి వారి ఆలయం శనివారం గోవిందనామ స్మరణతో మార్మోగింది. స్వామివారి దర్శనానికి భారీగా భక్తులు తరలిరావడంతో స్వామి వారి ఆలయం కోలాహలంగా మారింది. భక్తులు వైనతేయ గోదావరి నదిలో పుణ్యస్నానాలు చేసి స్వామివారికి తలనీలాలు సమర్పించారు. మొక్కులు చెల్లించారు. ఆలయం చుట్టూ ఏడు ప్రదక్షిణలు చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా రూ.2.93 లక్షల ఆదాయం వచ్చింది. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.2.22 లక్షలు రాగా, నిత్యాన్నదానం ట్రస్టుకు భక్తులు రూ.71,429 విరాళంగా సమర్పించారు. 5,861 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకోగా, 3,950 మంది స్వామివారి అన్న ప్రసా దం స్వీకరించారని ఆలయ ఈఓ జి.మాధవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ తెలిపారు.

పాఠశాలల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం

- విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ
- ఒక్కో మరుగుదొడ్డికి రూ.8 వేల పారిశుధ్య సామగ్రి
- క్లస్టర్ పరిధిలో 420 స్కూళ్లు



పాఠశాలలో మరుగుదొడ్డి

రాయవరం: విద్య, వైద్యానికి ముఖ్యమంత్రి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. మనబడి నాడు–నేడులో భాగంగా జరిగిన పాఠశాలలు, ఆస్పత్రుల అభివృద్ధికి నిలువెత్తు సాక్షీభూతంగా నిలుస్తున్నాయి. పాఠశాలలను అభివృద్ధి చేసి, వదిలేయకుండా వాటిని మరింత శుభ్రంగా నిలిపేందుకు కూడా చర్యలు చేపట్టారు. సర్కారు బడుల్లోని చిన్నారులు ఆరోగ్యంగా ఉండాలని భావించిన రాష్ట్ర ప్రభుత్వం పారిశుధ్యానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తూ అందుకు అవసరమైన సామగ్రిని సమకూరుస్తోంది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలోని 420 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, పాఠశాలల్లోని మరుగుదొడ్ల పరిశుభ్రతకు పారిశుధ్య సామగ్రిని పంపిణీ చేశారు.

కార్పొరేట్‌కు దీటుగా

రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న సంగతి తెలిసిందే. మనబడి నాడు–నేడుతో పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దడంతో పాటు అమ్మఒడి సంక్షేమ కార్యక్రమంతో పాటు, జగనన్న గోరుముద్ద ద్వారా విద్యార్థులకు పోషకాహారాన్ని అందజేస్తున్నారు. అలాగే తరగతి గదులు, మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండడం వలన అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉండడంతో పాఠశాలల్లోని మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగానే ప్రభుత్వ పాఠశాలల్లో గతేడాది నుంచి ఒక్కో మరుగుదొడ్డికి ప్లాస్టిక్ బకెట్లు, మగ్గులు, డస్ట్‌బిన్‌లు, బ్రష్‌లు, క్లీనింగ్ రసాయనాలు సరఫరా చేశారు. ఈ ఏడాది కూడా అదేవిధంగా సరఫరా చేశారు. ప్రాథమిక పాఠశాలలో ఒకటి లేదా రెండు, ఉన్నత పాఠశాలల్లో నాలుగు లేదా ఆరు మరుగుదొడ్లు వంతున ఉన్నాయి. వాటన్నింటికీ లక్షలాది రూపాయల విలువైన పారిశుధ్య సామగ్రిని అందజేశారు.

ఆయాల వేతనం పెంపు

పాఠశాలల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రభుత్వం పెద్దపీట వేస్తూనే వాటిని శుభ్రం చేసే ఆయాలకు నెలవారీ వేతనం పెంచింది. గతంలో ఆయాలకు నెలకు కేవలం రూ.2 వేల వంతున మాత్రమే చెల్లిస్తుండగా, గత విద్యా సంవత్సరం ఆగస్టు నుంచి నెలకు రూ.6 వేల వంతున చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అవసరమైన మేర పారిశుధ్య సామగ్రి అందుబాటులో ఉంచడంతో పాటు ఆశాజనకంగా వేతనాలు చెల్లిస్తుండడంతో సర్కారు పాఠశాలల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను తేటతెల్లం చేస్తోంది.



పాఠశాల, మరుగుదొడ్ల పరిశుభ్రతకు ప్రభుత్వం సరఫరా చేసిన సామగ్రి

పాఠశాలలకు కార్పొరేట్ లుక్



పాఠశాలల భౌతిక స్వరూపాన్ని మార్చడంతో ప్రభుత్వ పాఠశాలలకు కార్పొరేట్ లుక్‌ను తీసుకువచ్చింది. ఫలితంగా పాఠశాలల్లో చేరికలు పెరిగాయి. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశను తీసుకొచ్చింది.

– గుంటూరు అప్పారావు, హెచ్‌ఎం, ఎంపీపీఎస్, నంబర్–1, రాయవరం

స్థితిగతులు మారాయి



ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులు మారాయి. టాయ్‌లెట్ల నిర్వహణకు కూడా ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చింది. క్రమం తప్పకుండా ప్రభుత్వ పాఠశాలల టాయిలెట్లకు అవసరమైన సామగ్రిని ఏటా అందజేస్తున్నారు. పాఠశాలల భౌతిక అభివృద్ధి చేసి వదిలేయకుండా, వాటి నిర్వహణకు ప్రభుత్వం చర్యలు చేపట్టడం శుభ పరిణామం.

– నాయుడు రామచంద్రరావు, ఎంఈవో, మండపేట

చట్టాలపై అవగాహన ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

రామచంద్రపురం: చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల న్యాయ సేవా ధికార సంఘం ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా చట్టాల్లో కూడా పలు మార్పులు సంభవిస్తున్నాయన్నారు. వాటిని అందరూ తెలుసుకోవాలనే ఇటువంటి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. పోక్సో, గృహ హింస, వేధింపుల కేసులపై ఆయన వివరించారు. జూనియర్ సివిల్ జడ్జి వి.నాగేశ్వరరావు నాయక్ మాట్లాడుతూ ప్రజలందరూ చట్ట నియమ నిబంధనలు పాటించాలన్నారు. పలు చట్టాలపై బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు పిల్లి మురళీమోహన్ వెంకటరమణ వాడ్రేవు సాయి ప్రసాద్, సీనియర్ న్యాయవాదులు డి.పి.శాస్త్రీ, కముజు సూర్యనారాయణ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ న్యాయవాదులు టి.చలపతి, బండి శ్రీను, విఠల్, పాలచర్ల భరత్, కోర్టు సిబ్బంది, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో ల్యాబ్ భవనానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ నాగమణి, వైఎస్సార్ సీపీ కో–ర్డినేటర్ సూర్యప్రకాష్

కె.గంగవరం: మండల పరిధిలోని పామర్రు పీహెచ్‌సీ వద్ద ల్యాబ్ నూతన భవన నిర్మాణానికి ఎంపీపీ పంపన నాగమణి, వైఎస్సార్ సీపీ కోర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ శనివారం కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. పలు రోగాలకు చెందిన పరీక్షలు చేసేందుకు పామర్రు పీహెచ్‌సీ వద్ద ల్యాబ్ నిర్మాణానికి రూ.38 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో భవన నిర్మాణం చేపట్టనున్నారని ఎంపీపీ నాగమణి తెలిపారు. కోర్డినేటర్ సూర్యప్రకాష్ మాట్లాడుతూ ప్రభుత్వం వైద్యానికి పెద్దపీట వేసిందన్నారు. ఇప్పటికే ఆరోగ్య శ్రీ పథకం సంబంధించి రూ.5 లక్షల నుంచి 25 లక్షలకు పెంచిందన్నారు. దీంతో పాటు నాడు–నేడు ద్వారా పీహెచ్‌సీల అభివృద్ధి చేసిందని వైద్యులను అందుబాటులో ఉంచి మంచి వైద్యం అందిస్తున్నారని పేర్కొన్నారు. ఆరోగ్య సురక్ష ద్వారా రోగులను గుర్తించి మెరుగైన వైద్యం అందిస్తున్నారని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ వాసంశెట్టి వెంకటదుర్గ, వైఎస్సార్ సీపీ నాయకులు సాదే కపిల్, చిట్టూరి చిన్ని, వాసంశెట్టి సూరిబాబు, నానాపరవు శ్రీనివాస్, మేడిశెట్టి శ్రీనివాస్, కాదా వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

23న రాయవరంలో పోలమాంబ జాతర

- నేడు ముత్యాలమ్మ వారి జాతర

రాయవరం: ఈ నెల 23న నిర్వహించే రాయవరంలో కొలువైన పోలమాంబ వారి ఉత్సవాలు మూడు రోజుల పాటు జరుగుతాయి. ఆదివారం నాటి ముత్యాలమ్మ వారి జాతరతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. ఉత్సవాల సందర్భంగా గారడీలు, బ్యాండు మేళాలు, కోయ డ్యాన్సులు, గరగ నత్యాలు, సంగీత విభావరులు, కోబ్రా డ్యాన్సులు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. దాంతోపాటు, కనులు మిరుమిట్లు గొలిపే భారీ విద్యుద్దీపాలంకరణ ఏర్పాటు చేసినట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నౌడు వెంకటరమణ తెలిపారు. అమ్మవారి జాతరకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచే కాకుండా పశ్చిమ గోదావరి, విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల నుంచి భక్తులు వస్తారు. రాయవరం గ్రామానికి చెందిన ఆడపడుచులు కూడా ఉత్సవానికి తప్పనిసరిగా వస్తారు. సంక్రాంతికి వచ్చిన ఆడపడుచులు ఉత్సవం వెళ్లే వరకూ అమ్మగారి ఇంటి వద్ద ఉండడం పరిపాటిగా వస్తుంది.



పోలమాంబ తల్లి ఆలయం

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు విద్యార్థుల ఎంపిక



గుండ్రాజు శివజాహ్నవి



గీసాల తేజశ్రీరమ్య



మోకన ప్రవళిక



తాతపూడి శ్రావ్య

కాజులూరు: ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు తమ పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్టు కాజులూరు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం పంపన కృష్ణమూర్తి తెలిపారు. శనివారం గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది ఎన్ఎంఎంఎస్ స్కాలర్ షిప్‌నకు పాఠశాలకు చెందిన గుండ్రాజు శివజాహ్నవి, గీసాల తేజశ్రీరమ్య, మోకన ప్రవళిక ఎంపికయ్యారన్నారు. వీరికి ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తయ్యే వరకూ ప్రభుత్వం నుంచి ఏడాదికి రూ.12 వేలు చొప్పున ఉపకార వేతనం అందుతుందన్నారు. విద్యార్థులకు తర్ఫీదునిచ్చిన ఉపాధ్యాయుడు చింతా నారాయణమూర్తి తదితరులను హెచ్‌ఎం కృష్ణమూర్తి అభినందించారు. అదేవిధంగా దుగ్గుదుర్రు పాఠశాలకు చెందిన తాతపూడి శ్రావ్య ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికైనట్టు ఆ పాఠశాల హెచ్‌ఎం జి.అప్పారావు విలేకరులకు తెలిపారు.

బాధితులకు సాయం

మామిడికుదురు: మొగలికుదురు బడుగువారిపేటలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి నిరాశ్రయులైన బగుడు వెంకటరమణ కుటుంబానికి శనివారం పలువురు సహాయం అందించారు. రెడ్‌క్రాస్ సంస్థ తరఫున పి.గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్త జంపన బుజ్జిరాజు ద్వారా బరకం, వంట సామగ్రి, హైజెనిక్ కిట్, నిత్యావసరాలు అందించారు. ఏపీఎస్‌సీ డబ్ల్యూఏ మండల శాఖ ప్రతినిధులు 25 కిలోలు బియ్యం, దుస్తులు, వంట సామాగ్రి, నిత్యావసరాలు అందించారు. మండల శాఖ ప్రధాన కార్యదర్శి కె. కల్యాణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు సహాయం అందిస్తున్న రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులు

చేతి వృత్తులకు ప్రోత్సాహం

మామిడికుదురు: విశ్వకర్మ యోజన పథకం ద్వారా చేతి వృత్తులకు కేంద్ర ప్రభుత్వం ఉచితంగా శిక్షణ ఇచ్చి వారి ప్రావీణ్యత ఆధారంగా రూ.15 వేలు విలువైన పనిముట్లను అందించి వారిని ప్రోత్సహిస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడబాల సత్యనారాయణ పేర్కొన్నా రు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సమావేశాలు శనివారం మండల పరిధిలోని ఆదుర్రు, గోగన్నమఠం, కరవాక గ్రామాల్లో జరిగాయి. ఆయుష్మాన్ భారత్ కార్డును పేదలు వినియోగించుకుని రూ.5 లక్షల వైద్య సదుపాయాలు పొందే అవకాశం కేంద్రం కల్పించిందని పి.గన్నవరం అసెంబ్లీ కన్వీనర్ చీకురుమిల్లి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. సమావేశంలో సర్పంచ్‌లు బళ్ల శ్రీనివాస్, అల్లు విజయలక్ష్మి, పార్టీ నేతలు మెండా ఆదినారాయణ, గాడి సత్తిబాబు, పసుపులేటి మహలక్ష్మీరావు, వేగి వెంకటేశ్వరరావు, తాడి సుభాష్, కోటిపల్లి సాయిబాబు, కోటిపల్లి దుర్గ, కటికిరెడ్డి గంగాధరమ్ పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న సత్యనారాయణ

వాలీబాల్ విజేత హసన్‌బాద జట్టు

రామచంద్రపురం రూరల్: ఆడుదాం ఆంధ్రా కీడా పోటీల్లో భాగంగా శనివారం నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో హసన్‌బాద జట్టు విజయం సాధించింది. మండల పరిధిలోని ఎస్‌వీఆర్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శనివారం మండల స్థాయి వాలీబాల్ ఫైనల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో రామచంద్రపురం అర్బన్ జట్టుపై హజన్‌బాద జట్టు విజయం సాధించింది. విజయం సాధించిన జట్టు సభ్యులను సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, ఎంపీపీ అంబటి భవాని, పంచాయతీ కార్యదర్శి వి.సుబ్రహ్మణ్యం, పీఈటీలు అభినందించారు.

నియోజకవర్గ క్రికెట్ పోటీలకు కోరుమిల్లి జట్టు

కపిలేశ్వరపురం: ఆడుదాం ఆంధ్ర క్రికెట్ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచిన కోరుమిల్లి జట్టు మండపేట నియోజకవర్గ పోటీలకు ఎంపికైంది. ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి పర్యవేక్షణలో మండలంలోని 20 సచివాలయాల నుంచి మండల స్థాయి పోటీలకు ఎంపికైన జట్ల సమయం శనివారంతో ముగిసింది. మండల స్థాయిలో ఫైనల్‌కు వచ్చిన పడమర ఖండ్రిక, కోరుమిల్లి జట్లు మధ్య హోరా హోరీగా పోటీ జరిగింది. నాలుగు పరుగులు తేడాతో కోరుమిల్లి గెలవగా రన్నర్ స్థానంలో పడమర ఖండ్రిక నిలిచింది. పోటీలను వ్యాయామోపాధ్యాయులు మేకా సత్యనారాయణం, గుబ్బల వేణుగోపాల్, ముత్తా సత్యనారాయణ, రవి నిర్వహించారు.

కె.గంగవరం: పామర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శనివారం ఆడుదాం ఆంధ్రా పోటీలు హోరాహోరీ సాగాయి. చివరి రోజు ఆడుతున్న క్రికెట్ పోటీలను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ప్రభుత్వం పోటీలు నిర్వహిస్తుందన్నారు. క్రీడల్లో రాణించడం వల్ల యువత భవిష్యత్‌కు ఉపయోగం ఉంటుందన్నారు. అనంతరం పామర్రు, అముజూరు, పాణింగపల్లి, సుందరపల్లి జట్లుకు చెందని సభ్యులను పరిచయం చేసుకుని పోటీలు ప్రారంభించారు. ఎంపీపీ పంపన నాగమణి, సర్పంచ్‌లు వాసంశెట్టి వెంకటదుర్గ, నానాపరవు కళ్యాణిశ్రీనివాస్, నాయకులు సాదా కపిల్, చీకట్ల గోపాలం, ఎంఈఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



విజేత హసన్‌బాద జట్టు



సెమీఫైనల్స్‌లో విజయం సాధించిన అముజూరు టీం సభ్యులతో కో–ఆర్డినేటర్ సూర్యప్రకాష్



కపిలేశ్వరపురంలో క్రికెట్ ఫైనల్స్ పోటీలో టాస్‌ను పరిశీలిస్తున్న క్రీడాకారులు

108లో ప్రసవం



అంబులెన్సులో ప్రసవించిన ప్రశాంతి

మామిడికుదురు: మగటపల్లికి చెందిన గర్భిణి మిరప ప్రశాంతికి శుక్రవారం రాత్రి పురిటి నొప్పులు రావడంతో 108 కాల్ చేశారు. మామిడికుదురు 108 వాహన సిబ్బంది హుటాహుటిన మగటపల్లి చేరుకుని ఆమెను ఆస్పత్రికి తరలించే క్రమంలో నొప్పులు తీవ్రం కావడంతో మార్గమధ్యంలోనే ప్రసవం చేశారు. ప్రశాంతి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ, బిడ్డ క్షేమంగా ఉన్నారని, వారిని రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్టు 108 సిబ్బంది జీపీ దాసు, ఎం.మోహన్ తెలిపారు.

వెంకన్న ఆలయాల్లో పూజలు

అలమూరు: మండలంలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్య భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. చింతలూరు, సంధిపూడి, గుమ్మిలేరు, నర్శిపూడి, జొన్నాడ గ్రామాల్లోని ఆలయాల ఆవరణలో భక్తులు గోవింద నామస్మరణతో మార్మోగాయి. చింతలూరులోని గోశాలను దర్శించుకున్న భక్తులు గోమాతలకు పూజాధి కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక, భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

ప్రభుత్వ పాఠశాలల్లో సాంకేతిక విద్య

మలికిపురం: గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలకు సాంకేతిక విద్య అందుబాటు లోనికి తెచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనని మలికిపురం జెడ్పీటీసీ బల్ల ప్రసన్న కుమారి పేర్కొన్నారు. రామరాజులంక గ్రామం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు మంజూరైన ట్యాబ్‌లను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్లిన ఘనత కూడా జగన్‌దేనని ఆమె అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యావాణి, హెచ్ సుబ్బలక్ష్మి, ఎంపీటీసీ మేడిచర్ల వెంకట్రాజు పాల్గొన్నారు.

కేంద్రం పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

రామచంద్రపురం రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం పలు పథకాలను అమలు చేస్తుందని వాటిని పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇళ్ల సత్యనారాయణ అన్నారు. మండల పరిధిలోని యనమదల గ్రామ సచివాలయం వద్ద శనివారం వికసిత్ భారత్ కంకల్ప్ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయాం వద్ద ఏర్పాటు చేసిన గ్రామ సభలో అధికారులు, బీజేపీ నాయకులు పాల్గొని మాట్లాడారు. రమణ మాట్లాడుతూ అర్హులందరికీ గ్యాస్ కనెక్షన్ ఇవ్వడంతో పాటు సబ్సిడీపై గ్యాస్ బండను కేంద్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. దీంతో పాటు వైద్య రంగంలో కూడా పేదలకు రాయితీలను, సిబ్సిడీపై బియ్యాన్ని అందిస్తుందన్నారు. అనంతరం లబ్దిదారులకు గ్యాస్ కనెక్షన్లను పంపిణీ చేశారు. సర్పంచ్ పీవీవీ రమణ, ఎంపీటీసీ శ్రీరామకృష్ణ, ఈఓపీఆర్‌డీ సెల్వరాజ్, కార్యదర్శి శ్రీనివాస్, బీజేపీ నాయకులు శంకర్‌నారాయణ, సీహెచ్ జానికిరామయ్య, సత్తిబాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న నాయకులు

భక్తిశ్రద్ధలతో పాశాలమ్మ జాతర



పాశాలమ్మవారి రథం వద్ద ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- అంగరంగ వైభవంగా ఊరేగింపు
- అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరం గ్రామ దేవత పాశాలమ్మ జాతర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం అమ్మవారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అమ్మవారిని దర్శించుకున్నారు. ఊరేగింపు సందర్భంగా రథం వద్ద కొబ్బరికాయ కొట్టి పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అమ్మవారి జాతరను వైభవంగా నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీని అభినందించారు. ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తానని తెలిపారు. ఇప్పటికే ఆలయం వెనుక కల్యాణ మంటపం నిర్మాణం కోసం రూ.10 లక్షలు గ్రాంటు ఇవ్వడం జరిగిందన్నారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా కొంత స్థలాన్ని కూడా కేటాయించామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జాజుల రాము, ఉత్సవ కమిటీ నాయకులు కాలచర్ల పెద్దకాపు, తగరంపూడి దుర్గారావు, కాలచర్ల గోవిందు, గుగ్గిలం రవి, వైఎస్సార్ సీపీ నాయకులు కాలచర్ల చిన్నారావు, కాలచర్ల శివాజీ, ఎంపీటీసీ సభ్యుడు కాలచర్ల నాగు పాల్గొన్నారు.